ప్రజాశక్తి

ఆదివారం మే 12 2024 8 పేజీలు

శ్రీకాకుళం



## ఓటర్లకు గాలం

- డబ్బు, మద్యం ఎర
- ఇప్పటికే గ్రామాలకు చేరిన నగదు
- నాయకుల వద్ద మద్యం నిల్వలు

(2లో)

# ప్రచారం పరిసమాప్తం

- మూగబోయిన మైకులు
- హోరాహోరీగా సాగిన ప్రచారాలు
- చివరి రోజు పోటాపోటీగా ర్యాలీలు, సభలు
- మూతపడిన మద్యం దుకాణాలు

**ఎన్నికల్లో కీలక ఘట్టమైన ప్రచార పర్వానికి శనివారం సాయంత్రం ఆరు గంటలకు తెరపడింది. ఊదరగొట్టే మైకుల శబ్దాలు, డప్పుల మోతలు, జిందాబాద్ నినాదాలు మూగబోయాయి. చివరి రోజు బైక్ ర్యాలీలు, సభలు, ఇంటింటి ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. పోలింగ్‌కు ఇంకా ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉండడంతో వ్యూహ ప్రతివ్యూహాలకు సిద్ధమవుతున్నారు. పోలింగ్ రోజు ఓట్లను రాబట్టుకునే పనిలో ఆయా పార్టీల అభ్యర్థులు నిమగ్నమయ్యారు. చివరగా చేసే పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టిసారించారు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మరుసటి రోజు నుంచే వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. ప్రత్యేక ప్రచార రథాలను సిద్ధం చేసుకుని గ్రామాల్లో తిరిగారు. వాహనాలను పార్టీ మేనిఫెస్టో, గుర్తులు ఏర్పాటు చేయడంతో పాటు మైక్‌లు బిగించి ప్రచార పాటలతో హోరెత్తించారు. ఇంటింటికీ కరపత్రాలు, మేనిఫెస్టో పోస్టర్లు పంచారు. కార్యకర్తలు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు అందరి ఇళ్లకు వెళ్తూ తమ అభ్యర్థికే ఓటు వేయాలని (మిగతా...2లో)





మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 2,358 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్
- రెండు వేల మందితో బందోబస్తు
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 13న పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. పోలింగ్ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో ఎస్‌పి జి.ఆర్ రాధిక, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరోజు ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలు దాటినా క్యూలో వేచి ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తామని చెప్పారు. హింసకు తావులేని, రీ పోలింగ్‌కు అవకాశం ఇవ్వని ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 2,358 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18,92,457 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఇందులో పురుషులు 9,29,859 మంది కాగా, మహిళలు 9,45,945 మంది ఉన్నారని (మిగతా...2లో)

# ఆ పార్టీలను ఓడించాలి

- ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన... తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఈ ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధికి ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొవ్వాడలో అణుపార్కు పెట్టి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. మానవ తప్పిదం వల్ల గానీ, యంత్ర లోపం వల్ల ఏ చిన్న ప్రమాదం సంభవించినా ఇటు కాకినాడ నుంచి అటు ఒడిశాలోని ఛత్రపూర్ వరకు సమస్త జీవకోటి సర్వనాశనమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరల్ వ్యవస్థను ఒక పథకం ప్రకారం బిజెపి ధ్వంసం చేస్తోందని విమర్శించారు. ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. బిజెపి ప్రభుత్వ విధానాలతో పరిశ్రమలు మూతపడి, కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేసి గిరిజనుల భూములకు రక్షణ లేకుండా (మిగతా...2లో)




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

# అందరికీ ఊ కొట్టారు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండగ మరో రెండు రోజుల్లో ముగియనుంది. జిల్లాలో సుమారు 60 రోజులుగా సాగిన ప్రచారంలో ఓటర్ల చుట్టూ అభ్యర్థులు తిరిగారు. ఓటర్ల కరుణా కటాక్షం కోసం పరితపించారు. ప్రధాన పార్టీ అభ్యర్థులు చావోరేవో అన్నట్లుగా ప్రచారం చేశారు. ఇంట్లో ఎసి, బయటకు వస్తే ఎసి వాహనాల్లో తిరిగే అభ్యర్థులు మండుటెండను సైతం లెక్క చేయలేదు. చెమటలు కక్కుతూనే ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద ప్రచారం నిర్వహించడంతో, ఎండలో వారు పడుతున్న కష్టం రాజకీయ పార్టీలకు ప్రధానంగా వైసిపి, టిడిపి నాయకులకు బోధపడి ఉంటుంది. నరసన్నపేట వైసిపి అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ డిప్యూటీ సిఎంగా ఉన్న సందర్భంలో చేసిన వ్యాఖ్యలు అందరికీ గుర్తుండే ఉంటుంది. చెరువు గట్లపై కూర్చొని పని చేయకుండానే డబ్బులు తీసుకుంటున్నారని, ఉపాధి హామీ వృథా అని అప్పట్లో వ్యాఖ్యానించారు. కొందరు అభ్యర్థులు వినూత్న ప్రచారాలు చేపట్టారు. శ్రీకాకుళం అభ్యర్థి గొండు శంకర్ శ్రీకాకుళం నగరంలోని ఓ ఇంటికి వెళ్లి చింతపండు పిక్క తీశారు.




ఎంపీ రామ్మోహన్‌నాయుడు మేకపిల్లను మెడలో వేసుకుని గొర్రెల కాపరి అవతారం ఎత్తారు. మరికొందరు హోటల్‌లో టీ చేయడం, నూడిల్స్ చేయడం వంటి పనులు చేశారు. ప్రచారం సందర్భంగా పలు వృత్తుల వారిని, పలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను కలుసుకున్నారు. వారి కష్టాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అభ్యర్థులు అక్కడ్నుంచి వెళ్లిన తర్వాత వీరేం మా కష్టాలు తీరుస్తారు, ఎన్నికలైన తర్వాత వీరు కనిపిస్తారా అంటూ నిట్టూర్చారు. ప్రజల్లో చైతన్యం రావడంతో, ఇటువంటి విన్యాసాలను నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. వైసిపి, టిడిపి అభ్యర్థులు ఎవరు వెళ్లినా అందరికీ ఓటర్లు ఊ కొట్టారు. వీరిలో ఎవరికి జై కొడతారన్నది చూడాల్సి ఉంది.




ఈసారి ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా అభ్యర్థుల తరుపున వారి కుటుంబసభ్యులూ విస్తృతంగా తిరిగారు. కొత్తగా బరిలో నిలిచిన వారు అసెంబ్లీలో అడుగుపెట్టాలని మరింత కష్టపడి పనిచేశారు. గతంలో ఓటమిపాలైన వారు ఈసారి ఎలాగైనా గెలవాలని పట్టుదలగా ప్రచారం చేశారు. తమ పార్టీలు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలను జనంలోకి తీసుకువెళ్లారు. అవి ఎంతవరకు వారిని గట్టెక్కిస్తాయన్నది చూడాల్సి ఉంది. అధికారం కోసం పరితపిస్తున్న వైసిపి, టిడిపి అభ్యర్థులెవరూ జిల్లాలోని ప్రధాన సమస్యలను ప్రస్తావించిన పాపాన (మిగతా...2లో)

## పోలింగ్‌కు సర్వం సిద్ధం

తెలిపారు. ఇప్పటికే ఓటరు కార్డు ఉన్న వారిని మినహాయించి కొత్తగా 2,80,703 ఎపిక్ కార్డులు ముద్రించామని, వాటిని పోస్టల్ శాఖ ద్వారా ఓటరు ఇంటికే పంపించినట్లు తెలిపారు. ఓటరు అవగాహన కోసం జిల్లాలో స్వీప్ పేరుతో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఐదు లక్షల మందిని భాగస్వాములుగా చేశామని చెప్పారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 520**

జిల్లాలో 2,358 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో 298 ప్రాంతాల్లో 520 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 268 మంది సెక్టార్ ఆఫీసర్లు, 707 మంది మైక్రో అబ్జర్వర్లు నిరంతరాయంగా పోలింగ్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షిస్తారని చెప్పారు. హింసకు అవకాశం ఉండే పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయన్నారు. జిల్లాలో 1655 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామని చెప్పారు. 333 మంది వీడియోగ్రాఫర్లతో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు చిత్రీకరించి, జిల్లా కేంద్రంలోని కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షిస్తామన్నారు.

**మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు**

పోలింగ్ శాతం పెంచేందుకు వీలుగా ఓటర్లను ఆకర్షించేలా జిల్లాలో 31 మోడల్ పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా సిద్ధం చేశామని తెలిపారు. ఇవికాకుండా యువత కోసం నాలుగు, మహిళల కోసం పింక్ స్టేషన్లు ఎనిమిది, వికలాంగుల రెండు పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసిన వాటిలో ఒక్కో ప్రత్యేకత ఉండేలా తీర్చిదిద్దామన్నారు. వేసవి దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, చల్లటి నీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. వృద్ధులు, వికలాంగుల కోసం 1741 వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచామన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది ఇబ్బందులు పడకుండా మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, భోజన వసతి కల్పిస్తున్నామన్నారు.

**టోల్ ఫ్రీ నంబరు 18004256625**

ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తితే సంయమనం పాటించాలని కోరారు. ఏమైనా సమస్య తలెత్తితే 18004256625 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. ఓటర్లకు సంబంధించిన సమాచారం కోసం 1950ను సంప్రదించవచ్చన్నారు. ఎవరైనా మద్యం, నగదు ఇతర బహుమతులతో ప్రలోభాలకు గురి చేస్తే సి-విజిల్ యాప్‌కు నేరుగా వీడియోలు, ఫొటోలు పంపించవచ్చని చెప్పారు. నిరంతరం కంట్రోల్‌రూమ్ పనిచేస్తుందని తెలిపారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వచ్చే నెల నాలుగో తేదీన కౌంటింగ్ కూడా అక్కడే చేపడుతున్నట్లు తెలిపారు.

**భారీ బందోబస్తు**

పోలింగ్‌కు రెండు వేల మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. 11 పారామిలటరీ బృందాలు, రెండు ప్లటూన్లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏడు అంతర్రాష్ట్ర, నాలుగు అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని చెప్పారు. ఇప్పటివరకు రూ.4.39 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, మద్యం, గంజాయి, ఉచిత పంపిణి సామగ్రి వంటివి సీజ్ చేసినట్లు తెలిపారు. 4,624 మందిపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో 273 గన్ లైసెన్స్ హోల్డర్స్ ఉండగా, ఇప్పటికే 199 మంది గన్స్ డిపాజిట్ చేశారని చెప్పారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల ప్రవేశ మార్గం నుంచి 200 మీటర్ల పరిధి పైన మాత్రమే రాజకీయ పార్టీలు తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల్లో బయట నియోజకవర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు ఎవరూ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ప్రచారం పరిసమాప్తం

అభ్యర్థించారు.

**అభ్యర్థుల తరుపున రంగంలోకి పార్టీ అగ్ర నేతలు**

తమ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రధాన పార్టీలకు చెందిన అగ్ర నేతలు జిల్లాలో ప్రచారం చేశారు. సిద్ధం, మేమంతా సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. టెక్కలిలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగింపు, ఇచ్ఛాపురంలో రోడ్ షో నిర్వహించారు. టిడిపి జాతీయాధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచార సభకు రెండుసార్లు జిల్లాకు వచ్చారు. మొదటి విడతలో పలాసలో రోడ్ షో నిర్వహించారు. రెండో విడతలో పాతపట్నం, ఆమదాలవలసలో రోడ్ షో నిర్వహించారు. శ్రీకాకుళంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శంఖారావం యాత్రలు చేపట్టారు. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల టెక్కలిలో రోడ్ షో నిర్వహించారు.

**తగ్గేదేలా అన్నట్లు ఇతరులు**

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల బరిలో బిఎస్‌పి, జై భారత్ నేషనల్ పార్టీ, భారత చైతన్య యువజన పార్టీ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్, భారతీయ చైతన్య వేదిక, జాతీయ చేతివృత్తుల వేదిక, పిరమిడ్ పార్టీ తదితర రాజకీయ పక్షాలకు చెందిన అభ్యర్థులు, వీరితోపాటు ఇండిపెండెంట్లు తమశక్తి మేర ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి అభ్యర్థించారు. తమ గుర్తు, పేరుతో కూడిన ఫ్లెక్సీని ఆటోలకు ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

**పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి**

ప్రచారం పరిసమాప్తం కావడంతో, అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిసారించారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలవడంలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో బలహీనంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. వారిని ఆకర్షించే వ్యూహాలను రచిస్తున్నారు. ఆయా గ్రామాల్లో తమకు పట్టున్న ప్రాంతాలను గుర్తించి ఓట్లు వేయించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పోలింగ్ రోజున ఏజెంట్ల నియామకం, తమకు అత్యధికంగా ఓట్లు పడేలా అనుసరించాల్సిన వ్యూహాలపై అభ్యర్థులు అనుచరులతో చర్చలు మొదలు పెట్టారు. మరోవైపు ప్రలోభాల పర్వం అమలుకు సిద్ధమవుతున్నారు. ఓటర్లకు డబ్బులను ఎర వేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. నాయకుల ఇళ్లలో మద్యం బాటిళ్లను అందుబాటులో ఉంచారు. నాయకుల ఇళ్ల వద్ద ఓటరు స్లిప్పులను తయారు చేస్తూ కార్యకర్తలు తీరిక లేకుండా ఉన్నారు.

**మద్యం విక్రయాలపై నిషేధం**

ప్రజా ప్రాతినిధ్య చట్ట ప్రకారం సెక్షన్ 135 సి ప్రకారం జిల్లా ఎన్నికల అధికారులు డ్రై డే అమలు చేశారు. దీని ప్రకారం ఈనెల 12, 13 తేదీల్లో మద్యం విక్రయాలను నిలిపేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు, మిలటరీ క్యాంటీన్లను మూసివేశారు. రణస్థలంలోని బీర్ల తయారీ పరిశ్రమకు శనివారం సాయంత్రం ఆరు గంటలకు తాళం వేసి సీజ్ చేశారు.

## మొదటి పేజీ తరువాయి

## అందరికీ ఊ కొట్టారు

పోలేదు. ఆమదాలవలస చక్కెర పరిశ్రమను సహకార రంగంలో తెరిపించే అంశం ఎన్నికల్లో ప్రధాన అజెండాగా ఉండేది. ఈసారి ఎన్నికల్లో దాని ఊసే లేకుండా పోయింది. ఆమదాలవలస రోడ్‌షోలో పాల్గొన్న చంద్రబాబు దానిపై కనీస ప్రస్తావన కూడా చేయలేదు. కూలదోసిన కోడిరామ్మూర్తి స్టేడియాన్ని కొత్తగా నిర్మాణం చేపట్టే విషయంలో వైసిపి అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు, టిడిపి అభ్యర్థి గొండు శంకర్ నోట నుంచి కనీసం మాట రాలేదు. అర్థాంతరంగా ఆపేసిన శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు ఎప్పుడు పూర్తి చేస్తారో ఎవరూ చెప్పలేకపోయారు. జీడి పిక్కలకు సంబంధించి మద్దతు ధరపై పలాస అభ్యర్థి గౌతు శిరీష అక్కడక్కడా మాట్లాడినా, వైసిపి అభ్యర్థి సీదిరి అప్పలరాజు మాటమాత్రంగానైనా హామీ ఇవ్వలేదు. జిల్లాలో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న వంశధార ఫేజ్-2 స్టేజ్-2, ఆఫ్‌షోర్ వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఎవరూ తమ ప్రచారంలో చెప్పకపోవడం, ఆ అంశాన్ని పెద్దగా సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడం లేదు.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తమ పార్టీ అభ్యర్థుల తరుపున చేసిన ప్రచారంలోనూ ఇచ్చిన హామీలు జనాన్ని ఏ మాత్రం ఆకట్టుకోలేకపోయాయి. జిల్లాలో రెండు పర్యాయాలు ప్రచారానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రసంగించారు తప్ప జిల్లా అభివృద్ధికి ఏం చేయదలుచుకున్నారో ఒక్క మాట చెప్పలేదు. మూడు పర్యాయాలు జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలు చూస్తే చాంతాడంత ఉంటుంది. ప్రచారం చేపట్టిన ప్రతి ప్రాంతానికీ తెగ హామీలు గుప్పించారు. వీటిని జనం ఎంతవరకు నమ్మారని తెలుసుకోవాలంటే, వచ్చే నెల నాలుగో తేదీన చేపట్టే ఓట్ల లెక్కింపు వరకు నిరీక్షించాల్సిందే..!

## ఆ పార్టీలను ఓడించాలి

చేసిందని చెప్పారు. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేసిందని విమర్శించారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జత కట్టడం ఎవరికి మోసం చేయడానికని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి పాల్గొన్నారు.


---

- డబ్బు, మద్యం ఎర
- ఇప్పటికే గ్రామాలకు చేరిన నగదు
- నాయకుల వద్ద మద్యం నిల్వలు

# ఓటర్లకు గాలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం, రూరల్

ప్రచార పర్వం ముగియడంతో ప్రలోభాల పర్వానికి తెర లేచింది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మద్యం, నగదు పంపిణీకి పార్టీల అభ్యర్థులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇందుకోసం నమ్మకస్తులైన నాయకులు, బంధువులు, అత్యంత సన్నిహితులుగా ఉండే వారిని వినియోగించుకుంటున్నారు. మండలాల్లో ముఖ్య నాయకుడు చేతికి డబ్బులు అందించి, అక్కడ్నుంచి పంచాయతీలకు చేరవేస్తున్నారు. ఒక ప్రధాన పార్టీకి చెందిన ఒక ముఖ్య నేతకు రూ.ఐదు కోట్ల నగదును ఎన్నికల ఖర్చు కోసం ఆ పార్టీ పంపినట్లు సమాచారం. ఆ మొత్తాన్ని ఆయన ఎంపిక చేసిన డెడికేటెడ్ నెట్‌వర్క్ టీమ్‌కు అందించినట్లు తెలిసింది. వీరంతా ఆయా గ్రామాలు, వార్డుల్లో డబ్బుల పంపకాలకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను కలుసుకుంటూ చేతిలో పెట్టినట్లు తెలిసింది. మరో పార్టీ అభ్యర్థులు గ్రామాలకు రూ.ఆరు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. 40 నుంచి 50 ఓట్లను వేయించగలిగే నాయకులను గుర్తించి, వారి చేతిలో డబ్బులు పెట్టి పంపకాలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రెండు పార్టీలకు



చెందిన నాయకులు... ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయో లెక్కగట్టి ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.1500 వరకు ఆయా గ్రామాల పరిస్థితిని బట్టి చేతిలో పెడుతున్నారు.

**నాయకుల ఇళ్లలో మద్యం నిల్వలు**

మద్యం దుకాణాలు మూతపడడంతో, ఇప్పటికే పెద్దఎత్తున టిడిపి, వైసిపి నాయకుల ఇళ్ల వద్ద నిల్వ చేసుకున్నట్లు సమాచారం. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మద్యం అక్రమ రవాణాను అడ్డుకున్నా, చేరాల్సిన రీతిలో చాలావరకు చేర్చుకున్నారు.

**సీజర్ విలువ రూ.4,40,19,462**

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి నగదు స్వాధీనానికి సంబంధించి, లిక్కరు సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో రూ.1,68,44,420 నగదు, రూ.1,36,80,284 విలువైన బంగారం, రూ.14,41,669 విలువైన వెండి స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ.9,32,664 విలువైన మద్యం పట్టుబడింది. రూ.11,58,400 విలువైన గంజాయి, రూ.99,62,025 విలువైన ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు పంపిణీ చేసే సామగ్రి, ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మద్యం, నగదు పట్టుబడుతున్న కేసులన్నీ టిడిపి, వైసిపి నాయకులదే కావడం గమనార్హం.

**ఆదర్శంగా నిలిచిన ఇండియా ఫోరం అభ్యర్థులు**

ఇండియా ఫోరం బలపరిచిన అభ్యర్థులు ప్రచార ఖర్చులనే కొంత భారంగా నెట్టుకొచ్చారు. నగదు, మద్యం పంపిణీకి దూరంగా ఉన్నారు. టిడిపి, వైసిపి... నగదు, మద్యం పంపిణీలో తలమునకలై ఉంటే, ఇండియా ఫోరం అభ్యర్థులు మాత్రం ఓట్లు ఎలా వేయించుకోవాలి, పోలింగ్ రోజు ఏ విధంగా వ్యవహరించాలన్న అంశాలపైనే దృష్టిసారించారు.

---



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మనజీర్ జిలానీ సమూన్

## ఓటు వేయడం బాధ్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రతిఒక్కరూ ఓటు వేసేందుకు తరలిరావాలని, ఓటు వేయడం మనందరి బాధ్యత అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా 'నీ ఓటు, నీ భవిష్యత్' పేరిట ఓటు హక్కు వినియోగంపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శనివారం నిర్వహించిన బైక్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని 80 అడుగుల రోడ్డు మిల్లు కూడలి వద్ద ప్రారంభమైన ర్యాలీ సూర్యమహల్, ఏడు రోడ్ల జంక్షన్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ సాగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గత సాధారణ ఎన్నికల కన్నా ఎక్కువ శాతం ఓటింగ్ జరగాలన్నారు. 18 ఏళ్ల నిండి ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఎన్నికల్లో పోలింగ్ రోజు ఓటు వేయాలన్నారు. ర్యాలీలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, మెప్మా, హౌసింగ్ పీడీ కిరణ్, గణపతిరావు, ఎన్‌వైకె కోఆర్డినేటర్ ఉజ్వల్, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్ పలు శాఖల ఉద్యోగులు, యువత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనజీర్ జిలానీ సమూన్

## పక్కాగా వెబ్‌కాస్టింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వెబ్ కాస్టింగ్ పక్కాగా పరిశీలన జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిపిఎస్, వెబ్ కాస్టింగ్ పరిశీలకులతో కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 75 శాతం పోలింగ్ కేంద్రాలను వెబ్ కాస్టింగ్ ద్వారా కవర్ చేసినట్లు చెప్పారు. ఫిర్యాదుల పరిశీలనకు వెబ్ కాస్టింగ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు కెమెరాలు ఉంటాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌కు ఫుటేజ్ రావాలని చెప్పారు. సమస్య ఏమైనా ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. నెట్‌వర్క్ లేని ప్రాంతంలో వీడియో చిత్రీకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఫుటేజీలను పక్కాగా పరిశీలించాలన్నారు. ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ ప్రారంభమవుతుందని చెప్పారు. జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థతో వాహనాలు ఎక్కడ ఉన్నాయన్నది చూడాలన్నారు. పోలింగ్ అనంతరం వాహనాల సమాచారం తెలియజేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో కంట్రోల్‌రూమ్ నోడల్ అధికారి, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## గౌతు శిరీషను గెలిపించాలి

ప్రజాశక్తి- పలాస

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషను గెలిపించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు కోరారు. మండలంలోని కేదారిపురం నుంచి పెదంచల వరకు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు ఓటు వేస్తారో.., అభివృద్ధి చేస్తామని చెబుతున్న గౌతు శిరీషకు ఓట్లు వేస్తారో యువత ఆలోచించుకోవాలన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల మధ్య డిఫెన్స్ అకాడమీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తు పై ఓటు వేసి ఎమ్మెల్యేగా గౌతు శిరీషను, ఎంపీ రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు, సంతోష్ పాండా, పైల నాగార్జున, బాలకృష్ణ, తారకేశ్వరరావు, చిట్టిబాబు, పాడి దుర్యోధన, పాడి గణేష్, పీరికట్ల ధనుంజయరావు, కొవ్వూరు సంతోష్, గణేష్, సురేష్, సిసింద్రి, కుమారస్వామి, భీమారావు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

# ఆ పార్టీలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్లే...

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ఇండియా ఫోరం కాంగ్రెస్ అభ్యర్థి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణ శివారున ఉన్న వైఎస్ఆర్ విగ్రహం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కృష్ణాపురం జంక్షన్, ఊసవానిపేట, రైల్వేగేట్, మెట్టక్కి వలస, ఎంపిడిఒ కార్యాలయం, ఓవర్ బ్రిడ్జి మీదుగా పట్టణంలోని వన్ వే వద్దనున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాజీరావు మాట్లాడుతూ ప్రత్యేకహోదా, రైల్వేజోన్ తదితర హామీలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. టిడిపి, వైసిపికి ఓట్లు వేస్తే బిజెపికి వేసినట్లేనని అన్నారు. ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం సిపిఎం నాయకులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఆదాని, అంబానీలు వంటి పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ పరచి పేదల పొట్ట కొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలను ఇంటికి సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డేపల్లి గోవింద గోపాల్, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, బొచ్చా రమణ, లఖినేని సాయి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# మహిళా సాధికారతకు చంద్రబాబు భరోసా



ప్రచారం చేస్తున్న గొండు స్వాతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తూ చంద్రబాబు భరోసా ఇస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమ పాలన అందించగల సమర్ధవంతమైన టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్‌లను గెలిపించాలని తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి కోరారు. శనివారం నగరంలోని అరసవల్లి, ఆదిత్యానగర్ కాలనీలో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సోదరి పార్వతి, మరదలు డాక్టర్ సిహెచ్ హరితతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలను, మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా పక్షపాతి చంద్రబాబు తిరిగి సిఎం కాగానే రాష్ట్రంలో మహిళాభ్యుదయం ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహకారం అందించడంతో పాటు మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని రంగాలు, అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడే విధంగా మేనిఫెస్టో రూపకల్పన జరిగిందన్నారు. టిడిపి నాయకులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, ఎంపిటిసి గోపి, మండల హరికృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'సూపర్ సిక్స్'పై ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో ప్రజాధనాన్ని కొల్లగొట్టి రూ.వేలకోట్లు దోచుకున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని మాజీ ఎంపిపి గొండు జగన్నాధరావు కోరారు. గార మండలం వాడాడ పంచాయతీ రెడ్డిపేటలో ప్రజాగళం, సూపర్‌సిక్స్ ప్రచారంలో పాల్గొన్నారు. టిడిపి నాయకులు శిమ్మ శ్రీను ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జిల్లాలో అవినీతి ఎరుగని ఎంపీ రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్‌లను గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో ధర్మానకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తున్న చంద్ర బాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వాడాడ, రెడ్డిపేట గ్రామస్తులు పాల్గొన్నారు.



పొందూరు : ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు



శ్రీకాకుళం అర్బన్ : ప్రచారం చేస్తున్న జగన్నాథరావు

**పొందూరు:** మండలంలోని కేశవ దాసుపురంలో టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సోదరుడు కూన వెంకట సత్యనారాయణ ఎన్నికల ప్రచారాన్ని చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, గోవిందరావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపుల వద్ద ఎన్నికల కోలాహలం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సార్వత్రిక ఎన్నికల కోలాహలమంతా శనివారం సరుబుజ్జిలి, రొట్టవలస మద్యం షాపుల వద్ద కనిపించింది. ఎన్నికల నిబంధనల మేరకు శనివారం సాయంత్రం మద్యం షాపులు మూసివేసి సోమవారం ఎన్నికలు అనంతరం సాయంత్రం వరకు మద్యం ఉండదన్న ఆందోళనతో ఉదయం 11 గంటలకు మద్యం షాపులు తెరిచే సమయానికి మందు బాబులు క్యూ కట్టారు. అలాగే రెండు రోజులు ఎన్నికలు నిర్వహణకు అవసరమైన మద్యాన్ని ప్రధాన పార్టీలు సేకరించడానికి వారి అనుచరులు కూడా మద్యం కొనుగోలుకు ఎగబడటంతో షాపుల వద్ద గందరగోళ పరిస్థితి కనిపించింది.

జిల్లా ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు గత కొంతకాలం నుంచి రోజువారీ లక్ష్యాలతో అమ్మకాలు నిర్వహిస్తున్నామన్న ప్రభుత్వ మద్యం షాపులు శనివారం కూడా అవే నిబంధనలు పాటించడంతో వేగం గానే అమ్మకాలు పూర్తి చేశారు. సాయంత్రం ఎక్సైజ్ శాఖ అధికారులు వచ్చి సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మద్యం షాపులన్నింటినీ మూసివేసి సీల్ వేశారు.

## డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న డ్రైవింగ్ శిక్షణా తరగతుల్లో చేరేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కోసం లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ (ఫోర్ వీలర్) కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ డ్రైవింగ్ స్కూల్లో 15 బ్యాచ్‌లు శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. 16వ బ్యాచ్‌లో కేవలం 16 మందికి మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నందిగాం



బలరాం (ఫైల్)

మండలంలోని పెద్దతామరపల్లి వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు ప్రారంభంలో శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని నందిగాంకు చెందిన రాజాపు బలరాం (80) మృతి చెందారు. బలరాం ఇటీవల మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. మృతునికి భార్య నారాయణమ్మ, కుమారులు ప్రకాశరావు, నరసింహులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. నందిగాం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## మద్యం సీసాలు పట్టివేత

**మెళియాపుట్టి :** మండలంలోని పట్టుపురం సమీపంలో శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.2,76,480 విలువైన 1728 ఒడిశా మద్యం సీసాలను పట్టుకున్నట్లు టెక్కలి సెబ్ సిఐ జి.ఎస్.రాజశేఖర్ నాయుడు తెలిపారు. మద్యం సీసాలతో రవాణా చేస్తున్న ఆటోను సీజ్ చేసి ఇందుకు సంబంధించి ఎన్.లక్ష్మణరావు, టి.షణ్ముఖరావును అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలాస డిటిఎఫ్ సిఐ పి. రామచంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## మనస్సాక్షిగా ఓటు వేయాలి

**ఆమదాలవలస :** సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఓటరు బాధ్యతాయుతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని, మనకి మంచి చేసిన నాయకుడు ఎవరో మనస్సాక్షిగా ఆలోచించుకుని ప్రజాస్వామ్యానికి పట్టం కట్టాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. శనివారం వైసిపి నాయకులు శ్రేణులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించే నాయకుడిని గుర్తించాలని, అటువంటి నేతకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా తిరిగి జగన్మోహన్ రెడ్డిని ఎన్నుకోవాలని అన్నారు. ప్రతిపక్షాల ప్రలోభాలకు లొంగితే ప్రజానీకానికి భారీ నష్టం తప్పదన్నారు. ఎంపిపి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, నాయకులు గోవిందరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లెల్లో ప్రశాంత వాతావరణం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో గత కొన్ని రోజుల నుంచి నిర్వహించిన ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. ప్రధాన పార్టీలకు చెందిన టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం, స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ చైతన్య రథాలతో పాటు మెగా సౌండ్ డిజెలు, ప్రచార ఆటోలతో పల్లెలు పట్టణాల్లో శబ్దాలు హోరెత్తించాయి. ఎన్నికల నిబంధనలు మేరకు శనివారం సాయంత్రం ప్రచార పర్వానికి ముగింపు పలకడంతో గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో ఒక్కసారి డిజెల శబ్దం ఆగిపోవడంతో ప్రశాంత వాతావరణం చోటు చేసుకోవడంతో పలువురు ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా ఉపాధి పనులు జరుగుతున్న చోట ఉపాధి కూలీల ఓట్లను రాబట్టడానికి ప్రధాన పార్టీలకు చెందిన డిజెలు, ఆటోలు పనులు జరుగుతున్న చోటే నిలిపి వేసిన శబ్దాలు ఆగిపోవడంతో ఉపాధి కూలీలకు ఉపశమనం కలిగింది.

# అశోక్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రచార కార్యక్రమం చివరి రోజు శనివారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. 14 వార్డు దానంపేట నుంచి ప్రారంభించిన 12,13, 15 వార్డుల్లో సాగింది. ప్రధానంగా వైసిపికి కంచుకోటగా ఉన్న బెల్లుపడాలో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండూ టిడిపితోనే సాధ్యమవుతుం దన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న అశోక్






మాట్లాడుతున్న గౌతు శిరీష

# మున్సిపాల్టీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ప్రజాశక్తి- పలాస

టిడిపి అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని టిడిపి పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పెంటి భద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం తదితర ప్రాంతాల్లో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని, నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. మంత్రి సీదిరి అప్పలరాజు రైల్వే వంతెన పనులు పూర్తి చేయలేకపోయారని, తాము అధికారం లోకి వచ్చాక రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. మీ ఇంటి ఆడ బిడ్డగా ఒక్క ఛాన్స్ ఇస్తే పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని మాట ఇస్తున్నానని, ఇచ్చిన మాటను నిలబెట్టు కోకపోతే మరలా ఓట్లు అడిగేందుకు రానని శపథం చేశారు. వైసిపి నాయకులు ఇష్టానుసారంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెట్టి దోచుకొనేందుకు చూశారే తప్ప అభివృద్ధి చేయలేదని విమర్శించారు.

సొంత పార్టీ నాయకుల ఆస్తులను ఆక్రమించే స్థితిలో ఉన్నారన్నారు. వీరా పలాసను అభివృద్ధి చేస్తారు అంటూ విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్ నాయుడు ను గెలిపించాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, వజ్జ గంగాభవాని, దానేటి పద్మజీ, మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు, కొండే నర్సింహులు, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ప్రజాశక్తి- మందస

ఒక్క అవకాశం ఇస్తే పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు అన్నారు. మందస మండలం ఉమ్మాగిరి, పుచ్చపాడు, డబారు, హరిపురం, బాలిగం, కమలాపురం, వీరభద్ర, మకరజోల తదితర ప్రాంతాల్లో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవసరం ఉందన్నారు. బిజెపితో జత కట్టిన పార్టీలకు ఓడించాలని కోరారు. పలాస నియోజక వర్గంలో భూ కబ్జాలు దౌర్జన్యాలు లేకుండా చూస్తామన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేస్తామని చెప్పారు. ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేవిధంగా చర్యలు చేపడతామన్నారు. రిజర్వాయర్ల ఆధునికీకరణ పనులు చేపట్టి సాగునీరు అందిస్తామని చెప్పారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు ఆదుకుం టామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బమ్మిడి రాజారావు, కర్రి గణపతి, దుప్పల చలపతి, బద్రి సీతమ్మ యాదవ్, గొర్ల తులసీరావు, కొర్ల విశ్వనాథం పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న త్రినాథ్‌బాబు

# ప్రలోభాల సమయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నుకల కమిషన్ విధించిన నిబంధనల ప్రకారం రాజకీయ ప్రచారాలు శనివారం సాయంత్రంతో ముగిసింది. ఇక అసలు ప్రచారాలు ప్రలోభాలకు, తాయిలాలకు మిగిలిన ఆదివారం ఒక్క రోజు కీలకం. ఈ అత్యంత కీలకమైన సమయంలో ఓటర్ల అభిప్రాయలు మార్చేందుకు, ప్రలోభాలు పెట్టేందుకు ప్రధానంగా రాజకీయ పార్టీలు శాయశక్తులా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. నామినేషన్ దాఖలైనప్పటి నుంచి రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారాలు ఒక ఎత్తు అయితే... దానికి మించిన రహస్య ప్రచారాలు అత్యంత కీలకం. ఈ ఒక్కరోజు జాగ్రత్తగా లేకపోతే గెలిచే అభ్యర్థులు ఓటమి చెందక తప్పదనే ప్రచారం ఉంది. అలాగే ఓటమి దశలో ఉన్న అభ్యర్థులు గెలిచే అవకాశం కూడా లేకపోలేదు. అందుకే రాజకీయ పార్టీలు ప్రచారాల్లో అత్యంత కీలకమైన రోజుగా పరిగణిస్తారు. నేతలు తల రాతలు మారే రోజుగా భావిస్తారు. డబ్బులు, ఇతర ప్రలోభాలకు లొంగినా, ఎవ్వరికీ ఓటు వేయాలనేది ఓటర్లు ఎప్పుడో నిర్ణయం తీసుకున్నారు.


# హామీలు కావు.. నెరవేర్చే నాయకులు కావాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఎచ్చెర్ల టిక్కెట్ ఆశించిన కళా వెంకటరావు స్థానంలో కూటమి తరపున నడికుదిటి ఈశ్వరరావుకు కేటాయించారు. రెండోసారి గొర్లె కిరణ్ కుమార్ బరిలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో మాజీ మంత్రి కళా వెంకటరావు ఓటమి పాలయ్యారు. కళా వెంకటరావుపై గొర్లె కిరణ్‌కుమార్ 18,711 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి కరిమజ్జి మల్లేశ్వరరావు, వైసిపి అభ్యర్థిగా గొర్లె కిరణ్ కుమార్, బిజెపి అభ్యర్థిగా ఎన్.ఈశ్వరరావు బరిలో ఉన్నారు. గెలిచేది ఎవరైనా కింది సమస్యలపై దృష్టిపెట్టాలని నియోజకర్గ ప్రజలు కోరుతున్నారు.

## నియోజకవర్గంలో సమస్యలు ఇవీ...

- ఎచ్చెర్లలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటిలో అదనపు భవనాల పూర్తికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఇక్కడ అదనపు భవనాల నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. పూర్తి చేయలేదు పూర్తి చేయాల్సి ఉంది.
- మత్స్యకారుల కోసం ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద వేటకు ఉపయుక్తంగా ఉండేలా హార్బరు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. బడ్జెట్‌లో హార్బరు ఏర్పాటు చేస్తామని ప్రకటించి, అధికారులు భూసేకరణ చేశారు. 2023 ఏప్రిల్ 19న బుడగట్లపాలెం తీరంలో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎలాంటి ముందడుగు పడలేదు. పనులు ప్రారంభించాలి.
- ఎచ్చెర్ల మండలం ఎన్.ఎం.పురం పెద్ద చెరువుకు మడ్డువలస మిగులు జలాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చినా అది నెరవేరలేదు. దీంతో సాగు రైతులు ఏటా ఇబ్బందులు పడుతున్నారు. అదనపు ఆయకట్టుకు నీరందక ఎచ్చెర్ల మండల వ్యాప్తంగా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్య పరిష్కరించి రైతులకు సాగునీరు అందించాలి.
- తోటపల్లి ప్రాజెక్టు ద్వారా రణస్థలం, లావేరు మండలాలకు పూర్తి స్థాయిలో సాగు నీరందిస్తామని చెప్పారు. అయితే ఇప్పటికీ పిల్ల కాలువల తవ్వకం పూర్తి కాలేదు. పిల్ల కాలువల తవ్వకం పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి.
- ఎచ్చెర్ల మండలంలో ప్రధాన సాగునీటి వనరుగా నారాయణపురం కుడికాలువ ఉంది. ఈ కాలువకు దశాబ్దాలుగా ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ఆయకట్టు చివరి రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
- తమ్మినాయుడుపేట, పొన్నాడ గ్రామాలు నాగావళి నదికి ఆనుకొని ఉన్నాయి. ఈ గ్రామాల్లోని భూములు వరదల సమయంలో తరచూ కోతలకు గురవుతున్నాయి. కరకట్టలు నిర్మిస్తామని పలు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేరలేదు. ఈ పనులపై దృష్టి సారించాలి.
- తోటపాలెం నుంచి కొత్తపేట మీదుగా సంతసీతారాంపురం వెళ్లే రహదారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. ప్రజలు రాకపోకలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు చేయాల్సి ఉంది.
- లావేరు మండలం బుడుమూరులోని నారాయణసాగరం పెద్ద చెరువును మినీ జలాశయంగా అభివృద్ధి చేస్తే మండల ప్రజలకు ఎంతో ఉపయోగం కరంగా ఉంటుంది.
- లావేరు మండలం బుడుమూరు పెద్ద గెడ్డపై అదపాక, గుర్రాలపాలెం గ్రామాల మధ్య, నేతేరు, లక్ష్మీపురం గ్రామాల సమీపంలోని కాజ్‌వేలు శిథిలమవడంతో వీటి మీదుగా రాకపోకలు సాగించేందుకు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి స్థానాల్లో వంతెనలు నిర్మించాల్సి ఉన్నా... ఇంత వరకు ఎటువంటి అడుగులు పడలేదు.
- లావేరు మండలం వేణుగోపాలపురం, నాగంపాలెం, తాళ్లవలస, గుమ్మడాం, రణస్థలం తదితర గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్డులు అధ్వానంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీటిని బిటి రోడ్డుగా మారుస్తామని గత ఎన్నికల సమయంలో పలు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.
- తోటపల్లి ప్రాజెక్టు ద్వారా రణస్థలం మండలంలోని ఆయకట్టుకంతా పూర్తి స్థాయిలో సాగునీరు అందించాల్సి ఉంది. ఆ పనులపైనా దృష్టి పెట్టాలి.
- రణస్థలం మండలంలోని పరిశ్రమల్లో అర్హులైన స్థానిక యువకులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని పరిశ్రమల ఏర్పాటు సమయంలో కంపెనీల ప్రతినిధులు హామీలు ఇచ్చినా... పెద్దగా తీసులేదు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.
- రణస్థలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇంతవరకు అడుగులు పడలేదు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నత చదువులకు తోడ్పాటును అందించాలి.
- జి.సిగడాం మండలంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం మండల ప్రజలకు ఎదురుచూపులే మిగుల్చుతున్నాయి. పదేళ్ల కిందట కాంగ్రెస్ పార్టీ హయాంలో బొత్స సత్యనారాయణ జి.సిగడాం మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. ఆ పనులు పూర్తి చేయాలి.
- జి.సిగడాం మండలంలో మడ్డువలస, తోటపల్లి కాలువల ద్వారా సాగునీరు శివారు గ్రామాలకు అందటం లేదు. ఏటా పంటలు రైతులు సాగునీరు అందక నష్టపోవాల్సి వస్తుంది. మడ్డువలస, తోటపల్లి పిల్ల కాలువల ద్వారా మండలంలో బాతువ, గెడ్డకంచరాం, పెనసాం, ఎందువ, నడిమివలస, సేతుభీమవరం, నిద్దాం, పాలఖండ్యాం, వాండ్రంగి తదితర గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాలకు వరకు ఆధార పడి పంటలు పండిస్తున్నారు. కాలువల నిర్మాణాలు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- జి.సిగడాం మండలంలో రహదారుల మరమ్మతులు సమస్య వెంటాడుతుంది. మండలంలోని పెంట, నిద్దాం, ఎస్.పి.ఆర్.పురం, నక్కపేట, గొలుసుపూడిపేట తదితర గ్రామాల్లో రహదారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డు పనులను చేపట్టాలి.




పోటీ నియోజకవర్గంలో ఉత్కంఠ రేపుతోంది. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# ఫోన్‌లోనే ఓటరు స్లిప్‌లు

- డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలు
- సిద్ధం చేసిన ఓటరు హెల్ప్‌లైన్ యాప్
- ఓటరు ఐడి కొడితే అందుబాటులో వివరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. సోమవారం ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలన్న ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. నిర్వహణకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాటు పూర్తి చేసింది. అయితే గతంలో ఓటర్ల జాబితాలో తమ ఓటు హక్కు ఎక్కడ ఉందో తెలుసుకుని ఆ బూత్ వద్దకు వెళ్తే తప్ప ఓటరు స్లిప్ పొందడం సాధ్యం కాలేదు. ప్రస్తుతం రాజకీయ పార్టీల వద్ద స్లిప్‌లు తీసుకోవల్సిన అవసరం లేకుండా బూత్ లెవల్లో ఓటరు స్లిప్‌లను పంపిణీ చేసేలా ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. అయితే పని ఒత్తిళ్లు, ఇతర కారణాల రీత్యా ఓటర్లకు స్లిప్‌లు చేరకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఇంటింటికీ స్లిప్‌లను పంపిణీ చేసినా కొంద మందికి అందలేదని, చిరునమా మారిందని చెపుతున్నారు. గ్రామాల్లో ఆ పరిస్థితి లేకున్నా... పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య తలెత్తుతోంది. అధికారులు స్లిప్‌లు ఇచ్చేందుకు వచ్చినా ఆ చిరునామాలో అందుబాటులో లేక వాటిని తీసుకోలేకపోతున్నారు. ఓటరు స్లిప్ ఉంటే తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది. ఆ పోలింగ్ కేంద్రం ఎక్కడుందో తెలుస్తుంది. అదిలేక పోతే ఓటరు ఎక్కడికి వెళ్లాలో తెలియని ఇబ్బందిని ఎదుర్కొంటారు. అందువల్ల ఎన్నికల సంఘం ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను ఈ ఎన్నికలకు అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే కార్డు, ఓటరు స్లిప్‌ను పొందడానికి వీలు కల్పించారు. యాప్‌లో వివరాలు నమోదు చేస్తే ఓటరు స్లిప్ జనరేట్ అవుతుంది. దీన్ని మొబైల్‌లోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు .

### సాంకేతికంగా దీన్ని ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలంటే...

గూగుల్ ప్లేస్టోర్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోన్ నంబరు నమోదు చేసి తర్వాత ఓటిపి నంబరును వస్తుంది. దాన్ని నమోదు చేసుకుని అనంతరం పాస్వర్డు క్రియేట్ చేసుకోవాలి. దాన్ని ఉపయోగించి లాగిన్ అయితే మరో మారు ఓటిపి వస్తుంది. దాన్ని నమోదు చేయగానే యాప్ తెరుచుకుంటుంది. అందులో పైభాగాన సెర్చ్ యువర్ నేం ఇన్ ఎలక్ట్రోరల్ రోల్ అని ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే నాలుగు రకాలైన ఆప్షన్లు వస్తాయి. మొబైల్ నంబరు, బార్ లేదా క్యూఅర్ కోడ్ ద్వారా డిటైల్స్ లేకుంటే ఎపిక్ కార్డు నంబరు ద్వారా అని ఉంటుంది. దానిలో ఎపిక్ కార్డు నంబరు సెలక్టు చేసుకుని ఓటరు ఐడి నమోదు చేసి సెర్చ్ ఆప్షన్ కొడితే ఓటు వివరాలు, పోలింగ్ బూత్‌తో సహా వస్తాయి.

### స్లిప్‌లో సమాచారం ఎలా ఉంటుందంటే..

యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే దానిపై ఓటరు పేరు, వయసు, లింగం, తండ్రి పేరు, లేదా భాగస్వామి పేరు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలు, జిల్లా, రాష్ట్రం పేర్లు వరుసగా ఉంటాయి. తర్వాత పార్టు నంబరు, పోలింగ్ బూత్ నంబరు ఉంటుంది. అన్నింటి చివరిలో పోలింగ్ కేంద్రం నంబరు, పేరు ఉంటుంది. దాని ఆధారంగా నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి నంబరు చెప్పి ఓటు వేసేందుకు వీలుంటుంది.

ఈ స్లిప్‌లో ఓటరు కార్డు నంబరు, ఓటరు పేరు, పోలింగ్ కేంద్రం వివరాలు ఉండడం వల్ల నేరుగా కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలవుతుంది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటర్లు క్యూలైన్లలో నిలబడాల్సి వస్తుందని ఓటు వేసేందుకు వెళ్లడం లేదు. దీనివల్ల ఓటింగ్ శాతం ప్రతిసారీ తగ్గుతోంది. పోలింగ్ ముగిసే సమయానికి కొందరు ఓటర్లు వచ్చి క్యూలైన్లో నిలబడడం వల్ల పోలింగ్ మరింత ఆలస్యమవుతోంది. దీని నుంచి బయటపడేందుకు నిర్ధిష్టంగా పోలింగ్ కేంద్రం తెలుసుకుని నిర్ణీత సమయంలో వెళ్లి ఓటు హక్కును విని యోగించుకోవచ్చు.




# ఎన్నికల అధికారులకు ఏర్పాట్లు



డిగ్రీ కళాశాల మైదానంలో వేసిన కుర్చీలు

ప్రజాశక్తి- టెక్కలి

ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు టెక్కలి డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఆదివారం నాటికే ఎన్నికల సిబ్బంది డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకోనున్న దృష్ట్యా పోలింగ్ బూతులకు వెళ్లే సిబ్బందికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఉన్న 315 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 793 మంది పిఒలు, ఎపిఒలతో పాటు 1,515 మంది ఒపిఒలు కలిసి సుమారు 2 వేల పైచిలుకు ఎన్నికల సిబ్బంది డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకోన్నారు. దీని దృష్ట్యా కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశారు. టెక్కలి నియోజకవర్గంలో 35 రూట్లు, 35 సెక్టార్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకునే ఎన్నికల సిబ్బందికి ఇక్కడి నుంచే ఎన్నికల సామగ్రిని అందజేయనున్నారు. ఈ కారణంగా శిబిరం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఎండల వేడిమి అధికంగా ఉన్న దృష్ట్యా టెంట్లలో ఉన్న సిబ్బందికి గాలి, వెలుతురు ఏర్పాట్లకు కావాల్సిన లైటింగ్, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల మెటిరీయల్స్ తీసుకెళ్లే నిమిత్తం చేసే ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ తహశీల్దార్ బాలమురళీకృష్ణ పర్యవేక్షించారు. ఎన్నికల సామగ్రి కోసం వచ్చే సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశించారు.

# పాతపట్నంలో వన్‌టైం ఎమ్మెల్యేలు 9 మంది




ప్రజాశక్తి- కొత్తూరు

పాతపట్నం నియోజికవర్గంలో 1952 నుంచి 2019 వరకు శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వన్ టైం ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. వారిలో 1952లో ఋషికార్ లోకాపార్టీ తరుపున మండా పెంటం నాయుడు పోటీ చేసి గెలుపొందారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోతుల గున్నయ్య పోటీ చేసి గెలుపొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి శాసనసభకు ఎన్నికై ప్రాతినిధ్యం వహించారు. 1983లో టిడిపి తరుపున తోట తులసీదాస్ పోటీ చేసి శాసనసభ ఎన్నికై ప్రాతినిధ్యం వహించారు. 1985లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన ధర్మాన నారాయణరావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1996లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్‌టిఆర్ టిడిపి తరుపున పోటీ చేసిన నందమూరి లక్ష్మీపార్వతి శాసనసభకు పోటీ చేసి ఎన్నికయ్యారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరుపున శత్రుచర్ల విజయరామరాజు పోటీ చేసి శాసనసభకు ఎన్నికయ్యారు. 2014లో జరిగిన ఎన్నికల్లో వైసిపి తరుపున కలమట వెంకటరమణ పోటీ చేసి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 2019లో జరిగిన శాసనసభకు జరిగిన ఎన్నికల్లో వైసిపి తరుపున రెడ్డి శాంతి పోటీ చేసి గెలుపొందారు. ఇది ఇలా ఉండగా పాతపట్నం నియోజికవర్గంలో 1955, 1967లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున లుకలాపు లక్ష్మణదాసు పోటీ గెలుపొందారు. అలాగే 1978లో శాసనసభకు జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా కలమట మోహనరావు పోటీ చేసి గెలుపొందారు. 1989, 1994, 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో టిడిపి తరుపున పోటీ చేసిన కలమట మోహనరావు ఐదుసార్లు శాసనసబకు ప్రాతినిధ్యం వహించారు.

# నోటా అంటే..




నోటా సింబల్

ప్రజాశక్తి- జి.సిగడాం

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఓటర్లకు అసంతృప్తి ఉంటే ఆ విషయాన్ని నోటా ద్వారా తెలియజేయవచ్చు. ఈ విధానాన్ని 2003లో భారత ఎన్నికల సంఘం అమల్లోకి తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసలు ఈ నోటా అంటే ఏమిటి?.. దీని గురించి మరింత సమాచారం తెలుసుకుందాం.

నోటా అంటే 'నన్ ఆఫ్ ది ఎబో' అని అర్థం. బరిలో నిలిచిన అభ్యర్థులపై విశ్వాసం లేని పక్షంలో ఓటరు 'నోటా'కి ఓటు వేయవచ్చు. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అధికారాన్ని కల్పిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్లకు అవకాశం కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల గుర్తుతో పాటు నోటా (నన్ ఆఫ్ ది ఎబవ్)ను ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఓటు వేయాలంటే సదరు అభ్యర్థికో, పార్టీకో ఓ గుర్తు ఉంటుంది. ఆ గుర్తుకు ఓటర్లు ఓటు వేస్తూ ఉంటారు. అయితే, ఈ దఫా మాత్రం ఇప్పుడు పోటీలో ఉన్నవావాళ్లెవరికీ నేను ఓటు వేయడం లేదు అనే ఆప్షన్‌ను ఇవిఎంల్లో పొందుపరిచారు. ఆ బటన్ నొక్కితే సదరు ఓటరు ఓటు ఎవరికీ పడదు. కానీ, ఓటు హక్కును నోటా ద్వారా వినియోగించుకున్నట్టే.

### నోటా ఓటు లెక్కించబడుతుందా?

నోటాగా పోలైన ఓట్లను లెక్కిస్తామని, అయితే వాటిని చెల్లని ఓట్లుగా పరిగణిస్తామని ఎన్నికల సంఘం చెబుతోంది. కాబట్టి నోటాకు వేసిన ఓట్లు ఎన్నికల ఫలితాన్ని మార్చలేవు.

### నోటా ఉపయోగం ఏమిటి?

పోటీ చేసే అభ్యర్థులపై అసంతృప్తిగా ఉన్న వ్యక్తులు తన అభిప్రాయాన్ని నోటా ద్వారా తెలియజేయవచ్చు. అయితే దీని ద్వారా ఏ అభ్యర్థికీ మద్దతు ఇవ్వకపోయినా ఎక్కువ మంది ఓటు వేసేందుకు వచ్చే అవకాశాలు పెరిగాయి. బోగస్ ఓట్ల లెక్కింపు తగ్గుతుంది.

ప్రజలు తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా ధైర్యంగా చెప్పగలిగే వీలు కూడా నోటా కల్పించింది. అలాగే ప్రతికూల ఓటింగ్ వల్ల ఎన్నికల్లో వ్యవస్థాగత మార్పు వచ్చే అవకాశం ఉంది. రాజకీయ పార్టీలు స్వచ్ఛమైన అభ్యర్థులను ఎంచుకునే అవకాశం కూడా లేకపోలేదు.

### నోటాకు ఓటు ఎలా వేస్తారు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు అభ్యర్థుల జాబితా దిగువన 'నన్ ఆఫ్ ది ఎబౌ బటన్' ఆప్షన్ ఉంటుంది. దీనికి ముందు ఎవరైనా బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలనుకుంటే పోలింగ్ బూత్‌లోని ప్రిసెడింగ్ అధికారి వద్దకు వెళ్లి నోటా ఓటు వేయాల్సి వచ్చేది. కాలక్రమంలో దీనిని రద్దు చేశారు.

నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఎలాంటి ఫలితాలుంటాయనే దానిమీద ఎన్నికల సంఘం ఎలాంటి నియమాలను ప్రకటించలేదు. కానీ, పోటీ చేస్తున్న అభ్యర్థులకంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే రెండో స్థానంలో ఉన్న వ్యక్తినే గెలిచినట్లుగా ప్రకటిస్తారు

2019 ఎన్నికల్లో నోటాకు ఎచ్చెర్ల నియోజకవర్గంలో అసెంబ్లీ ఫలితాల్లో నాలుగో స్థానంలో ఉంది.ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు 99,672 ఓట్లు పడగా, కిమిడి కళా వెంకట్రావుకి 80,961 ఓట్లు పడ్డాయి. అయితే నోటాకు బిజెపి అభ్యర్థి కన్నా ఎక్కువ ఓట్లు ఈ నియోజకవర్గంలో పోలయ్యాయి. బిజెపికి 1022 ఓట్లు పడగా, అదే నోటాకు 4,628 ఓట్లు వచ్చాయి. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి ఎన్ని ఓట్లు వస్తాయో వేచిచూడాలి.

### 2019 ఎన్నికల్లో జిల్లాలో నోటా ఓట్లు

టెక్కలి నియోజకవర్గంలో 2,935, ఎచ్చెర్లలో 4,628, ఆముదాలవలస నియోజక వర్గంలో 2,656, శ్రీకాకుళంలో 3,082, పాతపట్నం 4,217, పలాస 3,044,ఇచ్ఛాపురం 3880, నరసన్నపేట 3,485 ఓట్లతో నాలుగో స్థానాల్లో నోటా నిలిచింది. మరి ఈ సారి 2024 ఎన్నికల ఫలితాల్లో నోటా ప్రభావం ఏవిధంగా ఉంటాదో వేచి చూడాలి.

# ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



ఆమదాలవలస : ఓటుహక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


జి.సిగడాం : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, బిఎల్‌ఒలు

ప్రజాశక్తి- టెక్కలి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్‌లో ప్రతిఒక్కరూ ఓటుహక్కుని సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. శనివారం టెక్కలిలో ఓటుహక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణ పురవీధుల్లో సాగింది. కార్యక్రమంలో తహశీల్దార్, బాలమురళీకృష్ణ, వెలుగు ఎపిఎం, ఎన్నికల డిటి, రెవెన్యూ, సబ్ కలెక్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆమదాలవలస:** ప్రజాస్వామ్య పరిరక్షణ, స్వచ్ఛమైన పరిపాలన కోసం స్వేచ్ఛగా ఓటు వేయండి... ఓ మహిళా మేలుకో.. నేటి మీ ఓటుతోనే రేపటి మన తీర్పు ఉంటుందని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు స్వయంశక్తి సంఘాల మహిళలకు పిలుపునిచ్చారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో శతశాతం పోలింగే లక్ష్యంగా 18 ఏళ్ల పైబడిన అర్హులైన వయోజనులందరూ తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. శనివారం మండలంలోని అక్కివరం, వంజంగి గ్రామ సంఘం మహిళలతో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మండల పరిధిలోగల గ్రామగ్రామాన మహిళలకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. భారత రాజ్యాంగం ప్రకారం, మన దృఢమైన ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధమని తెలిపారు. మహిళలు ఐకమత్యంగా అందరికీ అవగాహన కల్పిస్తూ, తమ కుటుంబ సభ్యులతో పాటు, స్వయం శక్తి సంఘాలు, గ్రామ సంఘాలలో అర్హత గల ఓటర్లంతా పోలింగ్ కేంద్రానికి వెళ్లి బాధ్యతగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అన్ని గ్రామ సంఘాల్లో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుల సూచనల మేరకు స్వీప్ యాక్టివిటీస్ నిర్వహించి అవగాహన కల్పిస్తూ, తోటి సంఘాల్లో గల మహిళల్లో తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే వారితో కూడా మాట్లాడి పోలింగ్ నాటికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకోమని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు రేణుక, రాజేశ్వరి, శ్రీదేవి, సుజాత, వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు చంద్రరావు, రమణతో పాటు మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

**జి.సిగడాం:** ఓటర్‌కు ఓటు ప్రాముఖ్యతతో పాటు వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు బైక్‌ర్యాలీ ముఖ్య ఉద్దేశమని ఎంపిడిఒ వెంకన్నబాబు అన్నారు. మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి మార్కెట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లందరూ స్వేచ్ఛ వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎండ వేడి లేకుండా టెంట్లు, తాగునీరు కల్పిస్తున్నామని తెలిపారు. ఓటర్లను చైతన్యపర్చి పోలింగ్ శాతం పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. అంగవైకల్యం ఉన్న ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంఇఒ అరసాడ రవి, ఎపిఎం రెడ్డి రామకృష్ణ నాయుడు, ఎపిఒ సత్యనారాయణ, బిఎల్‌ఒలు ర్యాలీలో పాల్గొన్నారు.

**బూర్జ:** ఓటుహక్కు కలిగి ఉన్న ప్రతిఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఐకెపి ఎపిఎం బాబురావు అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఓటు ప్రతిఒక్కరి ఆయుధమన్నారు. సకాలంలో సరైన నాయకున్ని ఎన్నుకునేందుకు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండి తోటివారు కూడా ఓటుహక్కు వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వంజరాపు రమేష్ బాబు, బి.రామకృష్ణ, బి.కిరణ్ కుమార్, మురళి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రణస్థలం:** రణస్థలం మండల కేంద్రంలో ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించుటకు ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో ఉపాధి హామీ, వెలుగు సిబ్బందితో శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించి ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఈ నెల 13న జరుగు పోలింగ్ రోజు ప్రతిఒక్క ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రభావాలకు తావివ్వకుండా ఓటును స్వచ్ఛందంగా వినియోగించు కోవాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు అనేది మన భవిష్యత్ మార్చే వజ్రాయుధమని, రాజ్యాంగం ఇచ్చిన ఓటు అనే హక్కును మనం సక్రమంగా వినియోగించుకొని, దేశాన్ని అభివృద్ధి దిశగా సుపరిపాలన ఇచ్చే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలన్నారు. నూతనంగా ఓటుహక్కు వినియోగించుకుంటున్న యువత వారు ఓటుహక్కు వినియోగించుకోవడమే కాకుండా వారి చుట్టుపక్కల ప్రజలకు ఓటు ప్రాముఖ్యతను తెలిపి, ఓటు వినియోగంపై అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలని కోరారు.

**నందిగాం :** అందరూ క్యూ పద్ధతి పాటించి విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపిడిఒ జి.శివప్రసాద్ సూచించారు. ఈ మేరకు నందిగాంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ నాగరాజు, ఎపిఎం జాంభవతి పాల్గొన్నారు.

**కొత్తూరు :** అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటు వినియోగించుకోవాలని ఎంపిడిఒ త్రివిక్రమరావు అన్నారు. వెలుగు సంస్థ ఆధ్వర్యాన పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద నినాదాలు చేస్తూ ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఒ ప్రేమలత, ఎపిఎం జనార్ధన, సిసి జ్యోతి పాల్గొన్నారు.



టెక్కలి : ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్


బూర్జ : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



రణస్థలం : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధి, వెలుగు సిబ్బంది


ఇంటింటా ప్రచారం చేస్తున్న జెడ్‌పిటిసి తదితరులు

## సంక్షేమమే గెలుపునకు సోపానం

ప్రజాశక్తి- బూర్జ

ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు జరిగిన అభివృద్ధి గెలుపునకు సోపానమని జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు అన్నారు. ఇంటింటా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమదాలవలస వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాంకు మద్దతుగా శనివారం దొంకలపర్తలో ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్నడూ లేని విధంగా అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారుల కుటుంబాలకు చేరాయన్నారు. పింఛన్, రేషన్ తదితర పథకాలు ఇంటివద్దనే అందుతున్నాయన్నారు. ముఖ్యంగా రైతులకు, మహిళలకు ఆదుకునేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. జరిగిన మేలును మర్చిపోకుండా తమ ఓటును ఫ్యాన్‌గుర్తుపై వేసి మరోసారి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసిపి ఇచ్చిన హామీలను ఓటర్లకు వివరించారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో రవికుమార్

## టిడిపిలో 20 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పొందూరు మండలం సింగూరుకు చెందిన దుప్పల గణపతి ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మెట్ట శ్యామలరావు, తమ్మినేని కామేశ్వరరావు, సీపాన రమణారావు, సింగూరు ఉపేంద్రరావు, మెట్ట జ్ఞానేశ్వరరావుతో పాటు మరో 20 కుటుంబాలు టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లగా రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, స్పీకర్ తమ్మినేని సీతారాం తమ గ్రామ సమస్యలపై ఏనాడూ దృష్టి పెట్టలేదన్నారు. చంద్రబాబు నాయుడుపై ఉన్న నమ్మకంతో టిడిపిలో చేరినట్లు ప్రకటించారు.

## సంక్షేమ పాలనను ఆదరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డిని మరోమారు గెలిపించాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు కోరారు. శనివారం నగరంలోని మంగువారితోటలో ఆయన మంత్రి ధర్మాన తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. నగరంలో అభివృద్ధికి చిరునామా ధర్మాన అని ఆయనకు అండగా ప్రజలు నిలవాలని కోరారు. సంక్షేమ పథకాలు రావాలంటే వైసిపిని మళ్లీ గెలిపించాలన్నారు. చంద్రబాబు మాటలను నమ్మి మరోసారి మోస పోవద్దన్నారు. 13న జగరనున్న ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటువేసి ఎంపీగా పేరాడ తిలక్, ఎమ్మెల్యేగా ధర్మాన ప్రసాదరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# తమ్మినేని విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రచారం చివరి రోజు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం విస్తృత ప్రచారం చేపట్టారు. శనివారం మండలంలోని దూసిపేట, తోటాడ, అక్కివరం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై అన్ని పార్టీలు కలిసి మూక్కుమ్మడిగా దాడి చేస్తున్నాయని, అయినా అదిరేది బెదిరేది లేదని ప్రజల గుండెల్లో జగన్మోహన్ రెడ్డి వున్నారని అన్నారు. ఒక్కడిపై ఇంత మంది దాడి చేస్తున్నారని, చంద్రబాబు దత్తపుత్రుడు, బిజెపి, కాంగ్రెస్‌తో కలిసి సిఎం జగన్‌ను ఓడించడానికి ఏకమవుతున్నారని, ఇదంతా గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు సిఎం జగనన్న నాయకత్వానికి జై కొడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపు తధ్యమని జోష్యం చెప్పారు. అనంతరం తమ్మినేని సీతారాం స్వగృహం నుంచి వన్ వే జంక్షన్ ప్రధాన రహదారి గుండా కృష్ణాపురం జంక్షన్ అక్కడ నుంచి రైల్వే స్టేషన్ జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, కోట గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, నీలారావు మెట్ట శారద, కోట జస్వంత్, తాండ్ర లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

## అశోక్‌ను గెలిపించాలి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని దొంకూరు పంచాయతీ బుర్జపాడులో శనివారం అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు రేయ్య కోదండ కృష్ణ ఆధ్వర్యాన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## వైసిపి విజయానికి తోడ్పాటు

**శ్రీకాకుళం అర్బన్:** జిల్లాలో వైసిపి అభ్యర్థుల విజయానికి బిసి వర్గాలు తోడ్పాటు అందించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పోలుమహంతి ఉమా మహేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని క్రెసెక్‌బ్లో శిష్టకరణ, సొండి, శ్రీశయన, అరవల, పట్టుశాలి సామాజిక తరగతుల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. స్వర్గీయ రాజశేఖరరెడ్డి సంబంధిత సామాజిక తరగతు లను బిసిల జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. సిఎం జగన్మోహన్ రెడ్డి బిసిలకు కులాల వారీగా ప్రత్యేక కార్పోరేషన్లు ఏర్పాటు చేసి పాలక వర్గాలను నియమించి రాజకీయ ప్రాధాన్యత కల్పించా రన్నారు. కార్యక్రమంలో శ్రీకూర్మం పాలక మండలి సభ్యులు డబ్బీరు శ్రీని వాసరావు, శ్రీనివాస పట్నాయక్, న్యాయవాది వాన కృష్ణచంద్, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్‌లు మాట్లాడారు. జిల్లాలో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన ప్రసాదరావులను గెలిపించాలని వారు కోరారు. సమావేశంలో డాక్టర్ వినీలబాయి పట్నాయక్, బావాజీ నాయుడు, కర్నేనిహరి, జి.ఆర్.జి.నాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు


మాట్లాడుతున్న గౌతు శిరీష

## అందరినీ ఆదుకుంటా...

ప్రజాశక్తి- పలాస

శ్రీశయన సామాజిక తరగతి కుటుంబంతో పాటు అందరినీ అన్ని విధాలా ఆదుకుంటామని పలాస టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శ్రీశయన నాయకులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశయన సామాజిక తరగతికి టిడిపి గుర్తింపునివ్వడంలో భాగంగా తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారని అన్నారు. అందువల్ల పార్టీలకతీతంగా తనకు గెలిపించాలని ఓటర్లను కోరారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

## వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మంత్రి స్వగ్రామమైన దేవునల్తాడలో వైసిపి నాయకులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ సీదిరి చిరంజీవులు ఆధ్వర్యాన నిర్వహించిన ప్రచార ర్యాలీలో మహిళలు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తు కు ఓటు వేసి డాక్టర్ సీదిరి అప్పలరాజును, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. నమూనా వివి ఎంలు పట్టుకుని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదరాజు, ఎంపిటిసి వెంకన్న, ఎంపిటిసి మాజీ సభ్యులు గాలి షణ్ముఖరావు, శేషగిరి పాల్గొన్నారు.


శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రోహిత్

## ఆస్పత్రిలో శుద్ధ జల కేంద్రం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన శుద్ధ జల కేంద్రం శనివారం ప్రారంభించారు. రూ.55 విలువ చేసే శుద్ధ జల కేంద్రాన్ని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పైడిశెట్టి దినేష్, ఆస్పత్రి వైద్యులు పి.దేవేంద్రరెడ్డిలు ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు, ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు సప్పటి రోహిత్, ఎం.రాజ కుమార్, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, నవీన్‌చౌదరి, మాటూరు నవీన్, పి.వెంకటేష్, ఎల్.సి.రావు పాల్గొన్నారు.

## గోవిందరావును గెలిపించాలి

కొత్తూరు : పాతపట్నం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావుకు మద్దతుగా టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ఆధ్వర్యాన కొత్తూరులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దవీధి, సిరిపిల్లి వీధి, బజారువీధి తదితర పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గోవిందరావును, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్.తాతబాబు, అమర్, టి.తిరుపతిరావు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

# 'స్వీప్'లో మెరిసిన లక్ష్మీసహస్ర


షీల్డ్‌ను అందుకుంటున్న లక్ష్మీసహస్ర

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని భైరిపురానికి చెందిన బల్లెడ రాజు, జ్యోతిల కుమార్తె బల్లెడ లక్ష్మీసహస్ర తన ప్రతిభతో ఆకట్టుకుంది. ఏకంగా కలెక్టర్ నుంచి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందుకుని ఔరా అనిపించింది. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటేద్దాం శ్రీకాకుళం అనే కార్యక్రమం నిర్వహించారు. అందులో ప్రతిఒక్కరూ ఎందుకు ఓటెయ్యాలి అనే అంశంపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ నేతృత్వంలో పోస్టర్ రూపకల్పన పోటీలు నిర్వహించారు. ఏడో తరగతి చదువుతున్న లక్ష్మీసహస్ర ఈ పోటీలో పాల్గొని ఓటర్ల అవగాహనకు సంబంధించి వివిధ అంశాలను తెలియజేసేలా పోస్టర్ రూపొందించి జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో కలెక్టర్ చేతులు మీదుగా లక్ష్మీసహస్రకు రూ.3 వేలు నగదు, షీల్డ్, ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీలో లక్ష్మీసహస్ర చూపించిన ప్రతిభకు తల్లిదండ్రులతో పాటు గ్రామ పెద్దలు, నాయకులు అభినందనలు తెలిపారు.

# అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జగన్మోహన్‌రెడ్డి హింసా రాజకీయాలకు, అరాచక పాలనకు స్వస్తి పలకాలని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపు నిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తపేట నుంచి కోటబొమ్మాళి పెద్ద చెరువు వరకు టిడిపి నాయకులతో కలిసి శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరాచక రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జగన్ బ్రాండ్ మద్యం తీసుకొచ్చి వేలాది మంది మహిళల మంగళ సూత్రాలు కొట్టేశారని, ఇప్పుడు భూములు కొట్టేయడానికి జగన్ ప్లాన్ వేశాడని విమర్శించారు. పట్టాదార్ పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ


గజమాలతో సన్మానిస్తున్న కార్యకర్తలు

ఉంటుందని, జగన్ ఫొటో ఉన్న పాసు పుస్తకాలను చించిపారేయాలని మండిపడ్డాడు. ఎన్‌డిఎ కుటమి అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు గురించి వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి తనను, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. ముందుగా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, పూజారి శైలజ, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలు కిటకిట

ప్రజాశక్తి- టెక్కలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు మూసివేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ విషయం తెలుసుకున్న మద్యం తాగేవారు దుకాణాల వద్దకు ఒక్కసారిగా బారులుతీయడంతో కిటకిటలాడాయి. పట్టణంలోని ఆరు దుకాణాల వద్ద మద్యం తాగేవారు బారులు తీరి నిలబడటం గమనార్హం. చాలా వరకు మద్యం దుకాణాల్లోని సిబ్బంది అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారనే ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సంబంధిత అధికారులు


మద్యం షాపు వద్ద మందుబాబులు

మద్యం దుకాణాల వద్ద కూర్చుని పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా మద్యం దుకాణాల ముందు మద్యం తాగిన వారు బారులుతీరి ఉన్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు ద్వారా పర్యవేక్షణ ఎప్పటికప్పుడు చేపట్టడం గమనార్హం.

## ఒక్క అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా అని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3 వార్డుల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధితో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల తిరుపతి, కొంతాల రామమూర్తి, నీలాపు ఢిల్లీ, సాలిన బాలాజీ, బొండా మహేష్, సాలిన మామయ్య, రేవతి పాల్గొన్నారు.

## టిడిపికి కళింగ కోమట్ల మద్దతు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కళింగ కోమటిలంతా ఎన్‌డిఎ కూటమి అయిన టిడిపి, జనసేన, బిజెపికే తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని టిడిపి బిసి కళింగ కోమటి సాధికారిక రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులు అన్నారు. స్థానిక బోయిన గోవిందరాజులు వైశ్య కళ్యాణ మండపంలో ఉత్తరాంధ్రాకు చెందిన కళింగ కోమటి సంఘ నాయకులతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత కళింగ కోమటిలను బిసిలో చేర్చారని అన్నారు. మళ్లీ చంద్రబాబు ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన సభలో అధికారంలోకి తరువాత కళింగ వైశ్యలను ఒబిసిలో చేర్చుతానని, చట్టసభల్లో స్థానం కల్పిస్తానని మాట ఇచ్చారని పేర్కొన్నారు. అందుకే తమ సంఘ


మాట్లాడుతున్న గోవిందరాజులు


నాయకులంతా ఉత్తరాంధ్రలో అన్ని నియోజకవర్గాల్లోని కళింగ వైశ్యులతో సమావేశాలు నిర్వహించి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని తీర్మానించారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి బిసి రాష్ట్ర డైరెక్టర్ జామి వెంకటరమణ, సోంపేట వైశ్య సంఘం అధ్యక్షుడు సాన షణ్ముఖరావు, టెక్కలి వైశ్య సంఘం అధ్యక్షులు లాడి శ్రీను, రణస్థలం వైశ్య సంఘం అధ్యక్షుడు, బిజెపి నాయకుడు నారాయణశెట్టి శ్రీనివాసరావు, నరసన్నపేట మాజీ సర్పంచ్ ఉన్నా పెద్దబాబు, ఎచ్చెర్ల కళింగ కోమటి సంఘం అధ్యక్షుడు కె.వి.వి.ఎన్.మూర్తి పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

## వైసిపిలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి- పలాస

వైసిపిలో ప్రభుత్వంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఎర్రయ్య, జిల్లా కార్యదర్శి సురేష్ అన్నారు. పలాస నియోజకవర్గం పరిధిలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో టిడిపి పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి దళిత నాయకులు వడ్డీ యాదగిరి, పట్టా మలేష్, గువ్వడా క్రాంతి, బోనేలా భైరాగి, ఎ.ప్రభుదాస్, యానాది వాసుదేవరావు, ఎస్.శంకర్, సిహెచ్.రామకృష్ణ, తుంగాన సింహాచలం, ఎం.గణపతి, బి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

## వైసిపితో అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జగన్నతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు అన్నారు. మండలంలోని అక్కువరం, బొప్పాయిపురం పంచాయతీల్లో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లను గెలిపించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలకతీతంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే వైసిపి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పొట్నూర్ అప్పలనా యుడు, పి.సూర్యారావు, కూన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను అందజేస్తున్న టిడిపి నాయకులు

## టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దలక్ష్మీపురంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి ఆధ్వర్యాన శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో టిడిపి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సిఎంగా చంద్రబాబునాయుడును గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడును, ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మడపాల భైరాగి, వంజంగి రమేష్, తిరుపతిరావు, శేషి భూషణరావు, బి.ఢిల్లీరావు, రుషికేశ్వరరావు, శారద, మాధవి పాల్గొన్నారు.

# మురుగుతోనే సహవాసం

- రోడ్డుపైనే మురుగునీరు
- అనారోగ్యాల బారిన ప్రజలు
- కన్నెత్తి చూడని మున్సిపల్ అధికారులు


యాళ్లవీధిలో సిమెంట్ రహదారిపై నిలిచిన మురుగునీరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని పదేపదే ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. వివరాల్లోకి వెళ్తే... పురపాలక సంఘ పరిధిలోని ఏడవ వార్డు చింతాడలోని యాళ్లవీధిలో రోడ్డుపై గత తొమ్మిది నెలలుగా మురుగునీరు నిలిచి అక్కడి ప్రజలు రోగాలబారిన పడి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యను పరిష్కరించాల్సిన పాలకులు, అధికారులు చూసి చూడనట్టు వ్యవహరి స్తుండడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పురపాలక సంఘం ఏర్పడి నేటికి 30 సంవత్సరాల పైబడి కావస్తున్నప్పటికీ వార్డుల్లో మౌలిక సదుపాయాలు నేటికీ పూర్తిస్థాయిలో కానరావడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ పట్టణంలో అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అధికారులు మొద్దునిద్ర వీడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చింతాడలోని యాళ్లవీధిలో కాలువలు మూసుకుపోయి మురుగునీరు రోడ్డుపైనే గడిచిన కొన్ని నెలలుగా నిలిచిపోతున్నది. మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని అక్కడ ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించు కున్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినప్పటికీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడమే తప్పా పూర్తిస్థాయిలో పరిష్కరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. తమపై పాలకులు, అధికారులు కక్షపెంచుకున్నారేమోనని యాళ్లవీధికి చెందిన ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల మాదిరిగానే తాము కూడా పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని అయినప్పటికీ తమపట్ల పాలకులు, అధికారులకు చిన్నచూపు ఎందుకో అర్థం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకొని సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించి తమను రోగాల బారినుంచి కాపాడాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

## ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలి

### కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

**పలాస:** లౌకిక వాదానికి విలువనిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి చేస్తే మోదీ ప్రభుత్వం ప్రయివేట్ పరం చేస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని, బిజెపి కూటమి అభ్యర్థులను ఓడించాలని జిల్లా డిసిసి ప్రెసిడెంట్, ఇండియా వేదిక ఎంపీ అభ్యర్థి డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. కాశీబుగ్గలో ఓ ప్రయివేట్ అతిథి గృహంలో శనివారం సిపిఐ, సిపిఎం నాయకులు చాపర వేణుగోపాల్, నెయ్యిల గణపతి, కాంగ్రెస్ నాయకులు శ్రీరంగం సురేష్‌లతో కలిసి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడం బిజెపికి అలవాటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే విగ్రహాలు నెలకొల్పి సెంటిమెంట్ రగుల్చుతున్నారే తప్ప దేశంలో ఒక్క ప్రాజెక్ట్ అయినా పూర్తి చేశారా, ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పారా అని ప్రశ్నించారు. ఈ దేశాన్ని నిర్మాణం చేసింది, ప్రజలు సుఖ శాంతులతో జీవించేందుకు బాటలు వేసింది కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అన్నారు. బాబుతో బిజెపితో పొత్తు ఉంటే, జగన్ ఓ తొత్తు అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వైసిపి హయాంలో పాలన గాడి తప్పిందని, అధికార, ప్రతిపక్షాలు అధికారం కోసం వెంపర్లాట తప్ప ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలేశాయన్నారు. అలాగే ఉద్దానం ప్రాంతంలో ప్రధాన సమస్య జీడి పంటకు గిట్టుబాటు ధర కోసం రైతులు, వామపక్షాలు, ప్రజా సంఘాలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ మంత్రి సీదిరి అప్పలరాజు ఓ ప్రజా కంటకుడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో సువిశాల తీర ప్రాంతం ఉన్నప్పటికీ వైసిపి ప్రభుత్వం, టిడిపి ప్రభుత్వంగానీ మత్స్యకారుల ఉన్నతికి చేసిందేమీ లేదన్నారు. భావనపాడులో హార్బర్ నిర్మిస్తే మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని, పోర్టు నిర్మించి కార్పొరేట్లకు దారాధత్తం చేసేందుకు వైసిపి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ఇది బడుగులకు ఎంత మాత్రం ఉపయోగ కరంగా లేదని ఆక్షేపించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే గృహ నిర్బంధాలు చేస్తూ ప్రశ్నించే గొంతుకులను నొక్కేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో గోరు వాసు దేవరావు పాల్గొన్నారు.

## వైసిపికి చరమగీతం పాడాలి : ఎంపీ


ప్రజలకు అభివాదం చేస్తున్న రామ్మోహన్ నాయుడు, శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికలకు మరి కొన్ని గంటల వ్యవధి ఉండడంతో టిడిపి నాయకులు తమ ప్రచారం దూకుడు పెంచారు. శనివారం ఉదయం నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌లు పాల్గొని ఎన్నికల్లో ఓటువేసి విజయాన్ని అందించాలని కోరుతూ ప్రజలకు అభివాదం చేశారు. నగరంలోని 80 అడుగుల రోడ్డు నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కళింగ రోడ్డు, ఏడురోడ్ల జంక్షన్, జి.టి.రోడ్డు, చౌక్‌బజార్, మాధవ్ మోటార్స్, రామలక్ష్మణ జంక్షన్ మీదుగా మండలం తంగివానిపేట, పెదపాడు, తండ్యాంవలస, బెండి వానిపేట, సిలగాం సింగువలస వరకు సాగింది. అనంతరం ఎంపీ రామ్మోహన్ నాయుడు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైసిపికి ఎదురుగాలి వీస్తోందని, ఐదేళ్ల ప్రజాకంటక పాలనకు చరమగీతం పాడే సమయం దగ్గర పడిందన్నారు. అయిదేళ్లలో స్వలాభం తప్ప ప్రజాసంక్షేమం పట్టని నేతలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పనున్నారన్నారు. వైసిపి నిర్లక్ష్యాలను, నిరంకుశ నిర్ణయాలను కప్పిపుచ్చుకునేందుకు అడ్డదారుల్లో గెలవాలని చూస్తున్నారని, ఈకుయుక్తులను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. దేశంలో ఎక్కడా అమలుకాని ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చి ప్రజల భూములు కొట్టేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ప్రజల గౌరవాన్ని నిలిపే చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులుగా రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్‌ల విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. ర్యాలీలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ హరనాథ్

**ఆమదాలవలస:** ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ హరనాథ్ అన్నారు. మండలంలోని బొబ్బిలిపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు నుంచి మాట్లాడుతు న్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంలో అపరిచితులకు డబ్బులు విత్‌డ్రా చేయమని ఎటిఎం కార్డును ఇవ్వరాదని తెలిపారు. రూపే ఎటిఎం కార్డుల ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్సూరెన్స్ పథకాలను వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పలత, సిఎఫ్ఎల్ సిబ్బంది చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), రామారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

## మౌలిక సదుపాయాలు పరిశీలించాలి

### కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. కంట్రోల్ రూంలో పోల్ డే మేనేజ్‌మెంట్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, లైటింగ్, పిడబ్ల్యూడి ఓటర్లకు సదుపాయాలు, జనరేటర్ తదితర సౌకర్యాలు తప్పక ఉండాల న్నారు. ఇవిఎంలపై దృష్టి సారించాలని, ఇవిఎంలు పనిచేయక పోయినా వెంటనే సెక్టార్ అధికారులను సంప్రదించి ప్రత్యామ్నా యంగా వేరొక ఇవిఎంలు తీసుకొనేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సెక్టార్ అధికారుల వద్ద ఇవిఎంలు రిజర్వ్‌లో ఉంటా యన్నారు. జిపియస్ వ్యవస్థ ద్వారా వాహనాల సమాచారాన్ని తెలుసుకోవాల న్నారు. ఈ సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్, ఎంసిసి నోడల్ అధికారి సిపిఒ లక్ష్మీ ప్రసన్న, ఇవిఎంల నోడల్ అధికారి కె.సుధ, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ తదితరులు

## ట్రిపుల్ ఐటితో ఒప్పందంపై అవగాహన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఆర్‌జియుకెటి, ఐఐటి తిరుపతి ఆర్‌వి అసోసియేషన్ గ్లోబల్ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టేషన్ సంయుక్తంగా ఆర్‌జికెయుటి ఛాన్సలర్ కె.సి.రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజయకుమార్, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, శ్రీకాకుళం డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ అధ్వర్యంలో ఒప్పందం కుదిరింది. ఈ సదస్సులో భాగంగా ఆర్‌జియుకెటికి వేతనంతో కూడిన ఇంటర్ షిప్ కల్పించాలని ఆర్‌వి అసోసియేషన్ గ్లోబల్ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టేషన్ కంపెనీతో అంగీకారం కుదిరింది. త్వరలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్ షిప్ కల్పించుటకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రొఫెసర్ బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో నాలుగు క్యాంపస్‌ల డైరెక్టర్లు, రిజిస్ట్రార్ రాజు, నాలుగు క్యాంపస్‌ల డీన్ అకడిమిక్స్, మోహన కృష్ణచౌదరి, ఎఒ రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.


బొబ్బిలిపేటలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

## ఓటుహక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించు కోవాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కనుగులవలస, బొబ్బిలిపేటలో కేంద్ర భద్రతా బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత ఎన్నికలు నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఎటువంటి వివాదాలకు వెళ్లకూడదన్నారు. ముఖ్యంగా యువత రాజకీయ పార్టీలకు వత్తాసు పలుకుతూ వాదనలకు దిగి వివాదాలను కొని తెచ్చుకోవడం వలన పోలీస్ కేసుల్లో ఇరుక్కొని తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో కేంద్ర భద్రతా బలగాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని హయాతీనగరం యువకులు మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైసిపిలో చేరారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆకుల సురేష్ నేతృత్వాన వీరంతా వైసిపిలో చేరారు.


పార్టీలో చేరిన యువకులతో ధర్మాన